మే డే స్ఫూర్తితో కార్మికవర్గం ఉద్యమించాలి

- కార్మిక రంగ వ్యతిరేక చట్టాలను కేంద్రం రద్దు చేయాలి
- ఘనంగా కార్మిక దినోత్సవం
- హక్కుల పరిరక్షణకు నడుంబిగించాలని కార్మిక సంఘాల పిలుపు


రాయచోటి అర్బన్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు


రాజంపేట రూరల్: సన్మానించిన కార్మికులతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, పోలా తదితరులు

రాయచోటి అర్బన్ : పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మేడే ఉద్యమస్ఫూర్తితో కార్మికవర్గం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 137వ మేడే దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జెండాను ఆవిష్కరించిన అనంతరం బస్టాండు సర్కిల్ మీదుగా నేతాజీ సర్కిల్ వరకు ప్రదర్శనను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆమెరికాలోని చికాగోలో కార్మికులు ప్రాణాలకు తెగించి పోరాటం చేసి 8 గంటల పని దినాన్ని సాధించుకున్నట్లు చెప్పారు. కార్మికుల హక్కులకు విఘాతం కలిగిస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలను అణచివేతకు ఉపయోగిస్తున్న జీఓ నం.1ని వెంటనే పాలకులు ఉపసంహరించుకోవాలంటూ కోరారు. కేంద్రంపై పోరాటానికి కార్మికులు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీసీఎల్‌సీ నేత రెడ్డెయ్య, గిరిజన సంఘం నేత శంకర్‌నాయక్, మహిళా సమాఖ్య నాయకురాలు సుమిత్ర, రైతుసంఘం నేత రంగారెడ్డి, కోటి, వెంకటేష్, డీహెచ్‌పీఎస్ జిల్లానేత సుధీర్ కుమార్‌తోపాటు ఏఐటీయూసీ నేతలు ఎస్.శ్రీనివాసులు, బత్తల వెంకటరమణ, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక హక్కులను పాలకులు హరిస్తుండడం తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జాబీర్ అన్నారు. సోమవారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి అక్రమ్‌బాషా, సురేంద్రరెడ్డి, రెడ్డి బసవయ్యలు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బస్టాండు, విద్యుత్, మున్సిపల్ కార్యాలయాల ఆవరణలో జెండాను ఎగురవేశారు. పురవీధులలో ర్యాలీని నిర్వహించి నేతాజీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, డి.భాగ్యలక్ష్మి, పలువురు నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా లేబర్ ఆఫీస్‌లో..

రాయచోటి టౌన్ : మే డే వేడుకలు ఘనంగా జరిపారు. సోమవారం రాయచోటి లేబర్ ఆఫీస్‌లో అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి డీసీఎల్ అధికారి డీవీ రంగరాజన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల హక్కులను వివరించారు. కార్యక్రమంలో రాజంపేట ఏసీఎల్ పద్మావతి, రాజంపేట ఏఎల్‌ఓ రూపేష్‌కుమార్, రాయచోటి ఏఎల్‌ఓ అల్లాబకాష్, పీలేరు ఏఎల్‌ఓ ఆనంద బాబు, అసిస్టెంట్ అధికారులు శ్యామ్ సుందర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటలోని ప్రధాన బస్టాప్ వద్ద సోమవారం సీఐటీయూ జెండాను ఎగురవేసి మే డే వేడుకలను ఘనంగా నిర్వహించామని సీఐటీయూ మండల నాయకుడు పి.సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు వెంకటాపతి, ఆటో యూనియన్ నాయకుడు విజయ్, అబ్దుల్ రసూల్, హసన్‌బాషా, ఆర్‌ఎంపీ అయ్యవారయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో మే డే సందర్భంగా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. సోమవారం వామపక్ష పార్టీల కార్యకర్తలు కార్మికులు మేడే నాడు ఎర్రజండాలు ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ టోల్‌గేట్ వద్ద జెండా ఆవిష్కరించారు. రైల్వేస్టేషన్, పంచాయతీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి గంగాధర్, జయచంద్రలతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా సోమవారం మండల వ్యాప్తంగా కార్మిక సంఘాల నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో మే డే సందర్భంగా ఏఐటీయూసీ, కార్మిక సంఘాల నాయకులు జెండ ఎగురవేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. చిన్నఓరంపాడు అడ్డరోడ్డులో మే డే సందర్భంగా సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కార్మిక సంఘం నాయకులు జెండా ఎగురవేసి నినాదలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జయరామయ్య, ప్రాజెక్టు అధ్యక్షులు బి.రమాదేవి, పి.రాధా కూమారి, ఏఐటీయూసీ నాయకులు పోకూరి మురళి, సీపీఐ నియోజవర్గ నాయకులు జ్యోతి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మే డే వేడుకలను పట్టణంలో కార్మిక సంఘం ప్రతినిధులు, కార్మిక నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు జరిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి కేక్ కట్ చేశారు. అనంతరం వివిధ యూనియన్‌లలో పనిచేస్తున్న కార్మికులను ఘనంగా ఆకేపాటి సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, పోలా వెంకటరమణారెడ్డిలతోపాటు మున్సిపల్ కౌన్సిలర్‌లు, కార్మికులు పాల్గొన్నారు.

మన్నూరు సచివాలయ పరిధిలోని పారిశుధ్య కార్మికులైన రవిశంకర్, తిరుపాలు, లక్ష్మీదేవమ్మలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ, మిరియాల శివరామకృష్ణ దంపతులు ఘనంగా సత్కరించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం భవన నిర్మాణ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. వేడుకలలో గాలి చంద్రయ్య, పి.మహేష్, ఎంఎస్ రాయుడు, ఈ.సికిందర్, శివయ్య, కార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 8 సెంటర్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు కార్మిక సంఘం నాయకులతో కలిసి జెండాలు ఆవిష్కరించారు. ఎర్రబల్లి ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.హరిప్రసాద్ మే డే సందర్భంగా యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు.

హమాలీల ఆధ్వర్యంలో..

లక్కిరెడ్డిపల్లె : ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) కార్యక్రమం సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సోమవారం సివిల్ సప్లై గోడౌన్ వద్ద 137వ మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్ సీనియర్ నాయకులు ఫరీద్, సురేష్, ఆరీఫ్, షఫీ, దర్బార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో ర్యాలీ..

చిట్వేలి : సిఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో 137వ మేడే దినోత్సవాన్ని సోమవారం చిట్వేలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం చిట్వేలి ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సిఐటీయు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు నాని, సుజాత, కెవిపీఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, వ్యవసాయ జిల్లా కార్మిక సంఘం నాయకులు శివయ్య, శివనంద, నాగయ్య, అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైల్వేకోడూరు అర్బన్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..


ఓబులవారిపల్లె: సీఐటీయూ ఆధ్వర్యంలో..


లక్కిరెడ్డిపల్లె: హమాలీలు ఆధ్వర్యంలో..


చిట్వేలి: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు


సిద్దవటం: జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి అర్బన్ : కలెక్టరేట్ వద్ద అర్జీదారులకు 18వ వారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సోమవారం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ ఆర్థికసహకారం అందజేశారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేటి నుంచి పోటీ పరీక్షలకు విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత పంకజ్ తెలిపారు. కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా సమ్మర్ బ్యాచ్‌ను ప్రారంభించనున్నట్లు ఆమె సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా అర్థమెటిక్స్, ఇంగ్లిష్, కంప్యూటర్ తదితర అంశాలపై విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పాస్ లేదా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8919911800 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి


ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ చెన్నకృష్ణ

రాజంపేట రూరల్ : కంటిచూపు సమస్యలున్న వారు, వయోవృద్ధులు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.ఎస్.చిన్నికృష్ణ కోరారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు 3వ విడత కార్యక్రమంను డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ చిన్నికృష్ణ ప్రారంభించారు. వైద్యులు వికాస్, లక్ష్మిప్రసన్న, సౌజన్య, సహాయ కంటి వైద్యులు వి.చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ఓ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, యూడీసీ సిద్దిరామయ్య, టీబీ సూపర్‌వైజర్ పి.జయప్రకాష్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జడ్జి లత

నందలూరు(రాజంపేట) : నందలూరు బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని సోమవారం జడ్జి లత ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో బార్ అసోసియేషన్ సెక్రటరీ సుబ్బరామయ్య, ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్‌అలీ, జాయింట్ సెక్రటరీ నాయనపల్లె అనుదీప్ జయసింహ, ఏజీపీ షమీవుల్లాఖాన్, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జున, ఏవీసుబ్రమణ్యం, హస్తవరం ఆనంద్‌కుమార్ తదితర జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

సంబేపల్లె : ఎనిమిది లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షరీఫ్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని పెద్దబిడికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంలో నాటుసారాను తరలిస్తున్నారని ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి గుదియవాండ్లపల్లె సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 8 లీటర్లు నాటు సారా, వ్యక్తితోపాటు స్కూటర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీతారాముల ఆలయానికి శంకుస్థాపన

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బుడుగుంటపల్లె దళితవాడలో సోమవారం సీతారాముల ఆలయం శంకుస్థాపన కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు పంజం సుకూమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్ కూమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బత్తిన వేణుపాల్‌రెడ్డి, తల్లెం చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీ భుజంగేశ్వర ఆలయంలో సోమవారం అర్చకులు చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన రుద్రాభిషేకంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ సహాయక జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు, గోపగుడిపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో పశుసంవర్ధక శాఖ సహాయకుడిగా పనిచేస్తున్న సెల్లు గణేష్‌యాదవ్‌కు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకునేందుకు అందరికి కృతజ్ఞతలను తెలియజేశారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి డీఎస్పీగా ఎస్. మహబూబ్ బాషా బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆయన రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తామని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ

రాయచోటి అర్బన్ : రాయచోటి మండల విద్యాశాఖాధికారిగా బాలాజి నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈఓగా పనిచేస్తున్న రమాదేవి ఆమె పాతస్థానమైన డైట్ అధ్యాపకురాలిగా వెళ్లింది. ఆమె స్థానంలో పీలేరు ఎంఈఓగా పనిచేస్తున్న జాలాజి నాయక్ బదిలీపై రాయచోటికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన బాలాజి నాయక్ దంపతులను ఎస్టీయూ నేతలు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

రాజంపేట సీనియర్ సివిల్ జడ్జిగా కేశవ

రాజంపేట : రాజంపేట సీనియర్ సివిల్ జడ్జిగా కేశవ బాధ్యతలు తీసుకున్నారు. మంగళవారం స్థానిక బార్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, కార్యదర్శి ఆనంద్, ప్రభుత్వ న్యాయవాది గురుప్రతాప్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఏబీ సుదర్శన్‌రెడ్డి, నాగరాజుగుప్తా, శింగంశెట్టి రవీంద్ర, జల్లి నారాయణ, కాశీ, కేవీరమణ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజంపేట డీఎస్పీగా వీఎన్‌కే చైతన్య

రాజంపేట : రాజంపేట డీఎస్పీగా వీఎన్‌కే చైతన్య సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలను శివభాస్కరరెడ్డి అప్పగించారు. చైతన్య తాడిపత్రిలో డీఎస్పీగా తొలి పోస్టింగ్ చేశారు. అక్కడి నుంచి రాజంపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శాఖపరంగా సబ్‌డివిజన్ స్థితిగతులపై ఆరా తీశారు. పలు పోలీసుస్టేషన్ల ఆకస్మిక తనిఖీలకు వెళ్లారు. పోలీస్‌స్టేషన్ వారీగా నేరాలకు సంబంధించి రికార్డుల పరిశీలనకు డీఎస్పీ సిద్ధమవుతున్నారు. ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా సాదాసీదాగా బాధ్యతల స్వీకరణ చేయడంతో ఆశాఖ వర్గాల్లో అప్పుడే చైతన్య మార్కు డ్యూటీ ఏంటో తెలిసేలా చేసింది.

దేవాలయాల అభివృద్ధికి సహకారం

రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని దేవాలయాల నిర్మాణాలతోపాటు పురాతన ఆలయాలకు జీర్ణోధారణ చేసేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో గ్రామాలలోని ఆలయాల అభివృద్ధికి రూ.20 లక్షలు విరాళం ప్రకటించి నగదును ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కోడూరు మండలంలోని కె.బుడుగుంటపల్లెలో రాములవారి గుడికి రూ.6 లక్షలు, చిట్వేలి మండలం మాతమ్మగుడికి రూ.4 లక్షలు, ఓబులవారి పల్లె మండలంలోని బాలిరెడ్డిపల్లెలో రాములోరి గుడి ప్రహరీకి రూ.6లక్షలు, అనంతరాజపేట అరుంధతివాడ మాతమ్మ గుడికి రూ.లక్ష10వేలు, మరిన్ని ఆలయాలకు మరమ్మతుల నిమ్మిత్తం ఈ నగదును ప్రకటించి అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శివసాయి, మల్లు క్రిష్టారెడ్డి, శ్రీరామ్ వినోద్, రమణారెడ్డి, దామర్ల సిద్దయ్య పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

ఆకట్టుకున్న ద్రౌపది కల్యాణ ఘట్టం

రామాపురం : మండలంలో గత వారం రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపది పాండవుల కల్యాణం నల్లగుట్ట పల్లె గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషన్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వేల సంఖ్యలో హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రమేష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలో వాటర్‌షెడ్ భూమి

చిట్వేలి : గ్రామంలో వాటర్ షెడ్‌కు కేటాయించిన భూమి ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని చెర్లోపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా ఆక్రమణదారులు గద్దల్లా వాలిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2 ఎకరాల వాటర్‌షెడ్ భూమిని జేసీబీతో చదును చేస్తున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఆక్రమణదారుడ్ని ప్రశ్నించగా రెవెన్యూ వారి అనుమతితో చదునుచేస్తున్నానని, త్వరలో పట్టా కూడా మంజూరు చేస్తారని చెబుతున్నట్లు గ్రామస్తుడు బాలకృష్ణ యాదవ్ తెలియజేశారు. ఈ ఆక్రమణ విషయమై ఆర్ఐను వివరణ కోరగా ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయి చర్యలు తీసుకుంటామన్నారు.


ఆక్రమించిన భూమిని చదును చేస్తున్న దృశ్యం

వరకట్నం కేసులో జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ అరెస్టు


దేవారెడ్డి ప్రసాద్‌రెడ్డి

రాజంపేట : హైదరాబాదులో జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుండుపల్లె మండలం మాపాలకుంట రెడ్డివారిపల్లెకు చెందిన దేవారెడ్డి ప్రసాద్‌రెడ్డిని వరకట్నం వేధింపు, హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సెక్షన్ 498–ఏ, 307 ఐపీసీ, డీపీఏ కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. జడ్జి 14రోజుల పాటు రిమాండ్‌కు పంపుతూ ఆదేశించారు. కాగా ఈ కేసుకు సంబంధించి నిందితుడి తల్లిదండ్రులతో పాటు అక్క ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారికోసం గాలిస్తున్నట్లు సమాచారం.

5 నుంచి కాలభైరవుడి తిరునాల

రాయచోటి టౌన్ : ఈ నెల 5వ తేదీ నుంచి కాలభైరవుడి తిరునాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు పోలు సుబ్బారెడ్డి, బుడ్డా ధర్మారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా రాయచోటి రూరల్ పరిధి యండపల్లె సమీపంలో తిరునాల నిర్వహణపై సోమవారం కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు పంచారు.

ఆన్‌లైన్ అర్జీలపై స్పందించండి

పెనగలూరు : ఆన్‌లైన్‌లో వచ్చిన అర్జీలపై వెంటనే స్పందించాలని తహసీల్దార్ శ్రీధర్‌రావు అన్నారు. సోమవారం రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా వచ్చిన అర్జీలు, సచివాలయం ద్వారా వచ్చిన అర్జీలు, ప్రత్యేక స్పందన ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కరించాలని ఆయన తెలిపారు.


పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ చైతన్య


సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ చైతన్య

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం రాత్రి నూతన డీఎస్పీ చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిన్నమండెం : మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఓ దాబా వద్ద సోమవారం కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా ద్విచక్ర వాహనదారుడు రహీంకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కేఏ50 ఎండీ 6881 నెంబర్ గల కారు మలుపు తిప్పుతుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గాయపడ్డ రహీంను 108లో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రహీం

నీటి ఎద్దడిని తీర్చడానికి ప్రత్యేక దృష్టి

రామాపురం : మండలంలో వేసవి కాలంలో తాగు నీటి సమస్య లేకుండా చూడడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల కన్వీనర్ మాజీ మండల అధ్యక్షుడు గడికోట జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ సభా భవనంలో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెకి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చరవాణి ద్వారా అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆదేశించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సమీక్షించి చర్చించారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వేసవిలో సరైన వేతనాలు ఇవ్వాలని సభ తీర్మానించింది. ఉపాధి హామీలు చేసిన సిమెంటు రోడ్లు బిల్డింగులకు రూ.98లక్షలు చెల్లించనున్నట్లు తెలిపారు. గడపగడపకు జరిగిన మన శాసనసభ్యులు అన్ని గ్రామాలలో పనులు పూర్తి చేయాలని మండల సమావేశంలో అధ్యక్షులు కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, నాగరాణి, ఎంపీడీఓ హైదర్‌వలి, తహసీల్దార్ సత్యానందం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, దృశికళ డైరెక్టర్ హుసేన్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ జనార్దన్‌రెడ్డి

నిరాధార ఆరోపణలు సమంజసం కాదు


గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేటలో కోట్లాది రూపాయల బెరైటీస్ ఖనిజం అక్రమాలు జరిగాయని నిరాధారంగా ఆరోపణలు చేస్తున్నారని అధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సమంజసం కాదని వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగంపేట కాపులపల్లె గ్రామంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పచ్చ మీడియాను అడ్డు పెట్టుకొని కొందరు టీడీపీ నాయకులు పిచ్చిరాతలు రాయించి బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గనుల నుంచి బెరైటీస్ ఖనిజాన్ని ఎంతమేర వెలికి తీశారు.. స్టాక్ పాయింట్‌లో ఏ-గ్రేడ్ ఖనిజం బీ-గ్రేడ్ ఖనిజం ఎంత మేరకు ఉందో రికార్డుల్లో స్పష్టంగా ఉంటుందన్నారు. అక్కడి నుంచి ఎంత మేర విక్రయాలు జరిగాయి, ఎంత స్టాక్ మిగిలి ఉందని అన్ని రికార్డుల్లో స్పష్టంగా ఉంటే వందల కోట్ల రూపాయలు బెరైటీస్ ఖనిజం ఏవిధంగా అవినీతి జరుగుందని ప్రశ్నించారు. దాదాపు పది సంవత్సరాల క్రితం శాలిని మిశ్రా ఎండీగా ఉన్న రోజుల్లో బెరైటీస్ ఖనిజం అక్రమాలు జరిగాయని అప్పట్లో దాదాపు 13 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. అప్పటి నుంచి భద్రతను పటిష్టం చేశారని తెలిపారు. అయిన ఒకరు ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులు వాటిలో కూడ లోసుకులు తెలుసుకొని అక్రమాలకు పాల్పడితే వందల కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని అధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని చెప్పారు. ఇప్పటికైన క్షేత్రస్థాయిలో ఏమీ జరిగిందో తెలుసుకొని అధారలతో ఆరోపణలు చేయాలని సూచించారు.

ఆలయ నిర్మాణాలు పూర్తి చేయాలి

సంబేపల్లె : తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ ద్వార రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు మంజూరైన ఆలయాలను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాళహస్తి దేవస్థానం ఈఈ మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలో గుట్టపల్లె, శెట్టిపల్లె, దుద్యాల, నాగిరెడ్డిగారిపల్లె, రెడ్డివారిపల్లె, రౌతుకుంట, గురిగింజకుంట, నారాయణరెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించి, వివిధ దశల్లో ఉన్న ఆలయాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 53 ఆలయాలకు సంబంధించి రూ. 5కోట్ల 30 లక్షలు మంజూరు చేశామన్నారు. ఈ ఏడాది చివరికల్లా ఆలయాల నిర్మాణాలు పూర్తి చేయాలని అయన సూచించారు. పురాతన ఆలయాలు, నూతన ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, సర్పంచ్‌లు రఘునాథ్‌రెడ్డి, అలివేలమ్మ, నాయకులు వేణురెడ్డి, నాగరాజుయాదవ్, ఎంపీటీసీ భద్రయ్య, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, అసిస్టెంట్ నపతికుమార్, ఏఈ రవితేజలు పాల్గొన్నారు.


ఆలయాల నిర్మాణాలపై ఆరా తీస్తున్న ఈఈ మురళీధర్‌రెడ్డి